అన్వేషణ

కృష్ణవేణి.కె

ఎన్నో జీవితాలకు తాను ప్రాణం పోశాడు. ఎన్నో జీవితాలలో చీకటిని పారద్రోలి వెలుగును ప్రసాదించాడు. 'అంధకారమయమైపోయిన తన జీవితానికింక వెలుగే లేదు. ఏ దేవుడూ ప్రసాదించలేడు. ఈ జీవితానికింక యింతే' గట్టిగా నిట్టూర్చాడు డా. మురారి.

— చిన్నప్పటినుండి తనకు చీకటంటే భయం. చీకటింట్లోకి అడుగు పెట్టాలంటే పరమ చిరాకు. కళ్ళలో వత్తులు వేసుకొని పెంచి పెద్ద చేసిన అమ్మ తామున్నంతవరకు ఆ అవసరమూ రానీయ

లేదు. కానీ ఇప్పుడో...కిటికీలన్నీ మూసి, తాళంవేసి ఉంచిన ఇంట్లోకి డ్యూటీ మండి వచ్చి, తాళం తీసుకొని పోవడమంటే ఆత్మహత్యా సదృశం. కానీ తప్పదు. విధి వ్రాత! అలవాటయిపోయింది చీకటి తనం. అంతులేని ఏకాంతం తన బ్రతుక్కు. ఏం చేస్తాం?

'పురాకృత సుకృత విశేష బలం!' వెయ్యిన్నూట పదహారోసారి కాబోలు... అనుకొన్నాడు డా. మురారి.

వాకిలి తీసిన వెంటనే పోస్టుమేన్ వేసి పోయిన వో నీలిరంగు కవరు ఎదురయింది. ఉత్తరాలు చూడాలన్న ఉత్సుకత జీవన మాధుర్యంతోపాటూ ఏనాడో ఎండిపోయింది. ఎవరు వ్రాసుంటారు? 'నా' అన్నవాళ్ళు లేనపుడు ప్రపంచమంతా చుట్టాలే అట. సూక్తులు చెప్పడం తేలికే. కానీ అనుభవంలోకి వచ్చేటప్పటికి గొంతు పడ్తుంది. ఏ రోగుల బంధువులో, లేకుంటే నయం చేసుకొని పోయిన ఏ రోగో—తన హస్తవాసిని గురించి పొగుడుతూ, తనను చల్లగా చూసి నూరేండ్లు కాపాడమని భగవంతుని అర్థిస్తూ వ్రాసుంటాడు. మామూలేగా తనకు...' అనుకొంటూ ఉత్తరం చేతికి తీసుకొన్నాడు.

పరిచయమైన అక్షరాలు! జ్ఞాపకాల అడుగునుండి బయటకు తీయడానికి కొట్టే వ్యవధి పట్టలేదు. వాసంతినుండి ఉత్తరం! ఎన్నాళ్ళకు. ఆశ్చర్యంతోపాటు ఆవేదనా మిళితమై మంచంమీద కూలబడిపోయాడు మురారి.

'ఏనాటి వాసంతి? యౌవనోషస్సులో తన జీవితంలోకి అడుగు పెట్టి, రెండేండ్లు ఏకఛత్రాధిపత్యంగా తన హృదయసామ్రాజ్యాన్ని పరిపాలించి, వాసంతే ప్రపంచంగా తన్నలరించి మరపించి, పెద్దల పెద్దతనానికి అమానుషంగా బలియై, తనకు దూరమయిపోయిన వాసంతి!

ఏ వాసంతి ఆలోచనలు తనను ఉక్కిరిబిక్కిరిచేసి తన జీవితాన్ని చీకటిమయం చేయడమే గాక తనను నమ్ముకొన్న మరో అమాయకురాలి జీవితం కూడా చీకటి చేసిందో...ఆ వాసంతి తిరిగి తన జీవితంలోకి ప్రవేశిస్తుందా? ఎండి మోడు వాడిన తన జీవితానికి మరల వసంతమా? అదెలా సాధ్యం? తన జీవన మకరందం ఏనాడో ఎండి ఆవిరయిపోయింది. ఇంక మిగిలింది ఉట్టి జీవఛ్ఛవం. మురారి నీడ—మురారి అన్న పేరుతో డాక్టరుగా పదిమందికీ పనికివచ్చేలా హాస్పిటల్‌లో బ్రతుకుతూ, ఇంట్లో సిగరెట్టు, త్రాగుడుతో ప్రపంచానికి దూరంగా బ్రతుకుతున్న మురారి! వాసంతి నిప్పుడేం చేసుకోగలడు? కవరు విప్పాడు, ఆలోచనలలా వదలి.

మురారీ,

ఆపత్సమయంలో ఆదుకొనేవాళ్ళే కాదు ఆప్తమిత్రులంటే...గుర్తొచ్చేవాళ్ళు కూడా ఆప్తమిత్రులే. ఈ మధ్య శ్యామల కలిసింది. నిన్ను గురించి చెప్పింది. 'అవసరం వచ్చినపుడు నా దగ్గరకు రావడానికి మొహమాట పడననీ, మన మధ్య స్నేహానికేం భంగం వాటిల్లదనీ' ఆనాడు మాటిచ్చావు గుర్తుందా? నీవు మాటకిచ్చే విలువ యింతేనా? మురారీ! నాటి మాటకిచ్చిన మాట తప్పి, భ్రష్టు పట్టిపోతున్నావు. లీలను వదిలేశావట. ఎందుకని? ఆమె చేసిన నేరమేమిటి? ఎందుకలా అందర్నీ హింసిస్తూ, నిన్ను నీవు నాశనం చేసుకొంటున్నావు? ఈ నీ నిర్ణయం ఇరవై ఏండ్ల క్రిందట తీసుకోవాలిసింది, మురారీ! ఇప్పుడు కాదు. నిన్నే నమ్ముకొన్న ఆమె జీవితం ఎందుకు నాశనం చేశావు? ప్రేమించుకోవడం చాలా సహజమైన విషయం. ఆ ప్రేమ ఎన్నో రకాలు కావచ్చు. మానవుడు సంఘజీవి మురారీ! ఒకరిపై ఆధారపడకుండా, తనకు తానుగా ఐదునిమిషాలు జీవించలేడు. మరొకరికోసం జీవించడంలోనే మానవుని మనుగడకు సాఫల్యం ఉండేది. సృష్టి వైచిత్రమదే. పిల్లల్ని తల్లిదండ్రులెంతగానో ప్రేమిస్తారు. స్వార్థరహితమైన ప్రేమ ఒక్క తల్లిదండ్రులలోనే చూస్తాము మనం. మరి పిల్లలుగా మనం చేసేదేమిటి? రెక్కలొచ్చిం తరువాత ఎగిరిపోవడం. మరి, వాళ్ళు కూడా నీలాగే జీవితాన్ని నాశనం చేసుకోవడం — ఆత్మహత్య చేసుకోవడం లాంటిది చేస్తే, మిగిలిన పిల్లల గతేమిటి?

పరిస్థితుల ప్రాబల్యం మానవుని వ్యక్తిత్వాలపై నీకు తెలియనిది కాదు. ప్రేమించావు. పెళ్ళి చేసుకోవాలనీ అనుకొన్నావు. ఇందులో ద్రోహచింతన లేదే! పరిస్థితుల ప్రాబల్యం వలన మరొకామె నీ జీవితంలోకి అడుగు పెట్టింది. నిలదొక్కుకొని, పరిస్థితుల కనుగుణంగా నడచుకోవడంలో ఉంది గొప్పతనం మురారీ! ప్రేమించడం తప్పుకాదు. కానీ ఆ ప్రేమ విఫలమయిందని నానా దురలవాట్లకూ బానిసలవడం, మానవత్వం మరచిపోయి, దానవులుగా మారడంలో నిజమైన నైతిక పతనముంది. నీవింతగా, దిగజారి పోతావని అనుకోలేదు మురారీ! నైతిక పతనమంటే నాకు పరమ చిరాకని నీకు తెలుసుగా!...నిన్నా పరిస్థితిలో చూడవలసి రావడం నా దురదృష్టం. అందుకే నే నింకా బ్రతికిఉన్నానేమోనని ఇప్పుడు దిగులుపడ్తున్నా.

నేను శుక్రవారం మధ్యాహ్నం మెయిలుకు అక్కడికొస్తున్నా, మీ కాలేజిలో జరగబోతున్న మెడికల్ కాన్ఫరెన్సు అటెండు అయ్యేందుకు. సోమవారంపాయం కాలం యింట్లోనే ఉండు.

ఇట్లు
వాసంతి.

'గతం నాస్తి' అన్నది పెద్దలసూక్తి, గతాన్ని మరచి, కొత్త భవిష్యత్తును మొదలుపెట్టడం తనకూ యిష్టమే. కానీ ఎలా ...? తన జీవితంపై చెదరని, మాయని, మధుర స్మృతుల మచ్చలు వేసిన గతం నాస్తి అని ఎలా అనుకోగలడు?

ఇలా జరగడానికి కారకు లెవరు? విషమ పరిస్థితులు చుట్టు ముట్టినపుడు ధైర్యం చెయ్యలేక తల వంచేసిన తనా? తన మాతృత్వపు అధికారంతో, అభిమానంతో తన చుట్టూ వల పన్నిన తల్లిదండ్రులా? కూతురి సుఖంకోసం, తన రక్తం ధారపోసి సంపాదించిన డబ్బుతో తన్ను కొనుక్కొన్న మామగారా? తనను, వాసంతిని ఒక్కటిగా చూడలేక కళ్ళు కుట్టుకొన్న సహాధ్యాయులా? ఏదీ కాక తన పూర్వజన్మ కర్మ అని సరిపెట్టుకోవడమా? ఏది కారణం!

* * *

అది తను పోస్టు గ్రాడ్యుయేషన్ కోసం మద్రాసుకు వెళ్ళిన మొదటి రోజులు. మద్రాసు మెడికల్ కాలేజిలో ఆంధ్రులకు పోస్టు గ్రాడ్యుయేషన్‌కు సీటు దొరకడం దుర్లభం. నిజానికి తన కెంతో గ

కారణమేది? కానీ తనది కాని భాష — తనది కాని ఊరు — ఒంటరి తనం — ఒక్కుమ్మడిగా తన్ను ఉక్కిరి బిక్కిరి చేశాయి. బ్రతుకు దుర్లభ మనిపించింది. అప్పుడే ప్రవేశించింది వాసంతి తన బ్రతుకులోకి. 'ఏమండీ! మీరు ఆంధ్రులటగా. నాకు చాలా ఆనందంగా ఉంది. ఇన్నాళ్లకొక తెలుగు మిత్రుడు దొరికినందుకు. మేమూ ఆంధ్రులమే. కానీ ప్రవాసాంధ్రులం. అది సరేగానీ, ఏ సబ్జెక్టుపై థీసిస్ సబ్మిట్ చెయ్యబోతున్నారు?' అంటూ తన్ను తాను పరిచయం చేసుకొంది. వాసంతి ఎక్కడుంటే అక్కడ సెలయేటి గల గల, పక్షుల కిల కిలలూ ఉండేవి! ఆ పరిసరాలకూ, ఆ రోగులకూ, తనకూ మధ్య మీడియంగా తయారయింది వాసంతి. తన గైడు, లీడరూ సర్వం వాసంతే. వాసంతి లేకుంటే సినిమాకూడా చూడ బుద్ధయేది కాదు తనకు. వాసంతి పర్యవేక్షణక్రింద తనో చిన్న పిల్లాడయి పోయాడు. వాసంతి ఫైనలియర్‌కు రావడం, తాను రెండో సం. రం ఎమ్. డికి రావడం జరిగింది.

వేసంగి సెలవుల్లో ఆంధ్ర రాష్ట్రాన్ని — ఆంధ్రుల అందాల రాజధాని అయిన జంట నగరాలని చూపెట్టడం కోసం, ఊరికి తీసుకొచ్చేడు మురారి వాసంతిని. తల్లి దండ్రులకూ పరిచయం చేశాడు. 'వాసంతి నా గైడమ్మా! వాసంతే గనుక లేకుంటే నేను మద్రాసులో ఉండే వాణ్ణే కాదు! ఎమ్. డి. లేకుంటే పోయిందని ఏనాడో వచ్చేసి ఉండేవాణ్ణే...' అంటూ. అమ్మ ఎంతో సంతోషపడ్డది. ఎంతగానో చూసుకొంది వాసంతిని. 'కూతుండ్లు లేని నాకు నీవో కూతురమ్మా!' అంటూ మురిసిపోయింది కూడా.

పరీక్షలు దగ్గరవ్వే కొద్దీ — తాము మరింత చేరువకు రాసాగారు. తెలియంది చెప్పించుకోవడానికి రాత్రుల్లో కూడా రూముకొచ్చేది వాసంతి. మొదట తనకెలాగో ఉన్నా వద్దంటే ఎక్కడ నొచ్చుకొంటుందోనని మౌనం దాల్చాడు మురారి. అప్పుడే హాస్పిటల్లో గుసగుసలు ప్రారంభమయ్యాయి. మనకు కాపట్టని విషయాలెన్నో లోకానికి కాపదుతుంది. అది తప్పులు పట్టం దెవరిని? కానీ అప్పుడు భయమేసింది. వాసంతి ఈ దుమారానికి భయపడి తన కెక్కడ దూరమవుతుందోనని.

అప్పటికి కానీ మురారికి తెలిసిరాలేదు. మురారి జీవనలత వాసంతి అనే మొక్క చుట్టు అల్లుక పోబడిందనీ, ఆ ఆలంబనం లేకుంటే మురారి జీవితమూ లేదన్న విషయం. అలా గుర్తించడాని కెంతో భయపడ్డాడు.

ఆ సాయంకాలం మెరీనాబీచ్‌లో కూర్చున్నారు. ఏదో బాధ. వ్యాకులత. తనది కాని ఆవేదన. మౌనంగా కూర్చున్న మురారిని చూసి ఆశ్చర్యపోయింది వాసంతి. 'ఏం మురారీ! ఒంట్లో బాగా లేదా? ఇంట్లో నుండి ఏమయినా ఉత్తరం వచ్చిందా? అలా ఉన్నావెందుకని...'

'అబ్బే. అదేం లేదు వాసంతీ! నిన్నో ప్రశ్న అడగాలని ఎన్నో రోజుల్నుండి అనుకొంటున్నా. నీవేమనుకొంటావో నన్న భయం అడగనియ్యటం లేదు. సమాధానం ఎటువంటిదైనా ఫరవాలేదు. కానీ నాకు సూటిగా జవాబు కావాలి. వాసంతీ! నన్ను గురించి నీ అభిప్రాయమేమిటి?'

వాసంతి ముందు తెల్లబోయింది. అటు తరువాత తెప్పరిల్లుకొని కిలకిలా నవ్వేస్తూ 'ఇందుకేనా? ఇంత గాంభీర్యం? ఇంత మౌనం. ఎన్నాళ్ళ రిహార్సల్సు చేశావేమిటి?' అంది తన సహజమైన హాస్య ధోరణిలో.

'వాసంతీ! నాకు సమాధానం కావాలి. ఇది నవ్వులాటలకు కాదు. నవ్వులాట కిది సమయం కాదు.'

'మురారీ! తన కుడి చేతిని గురించి, తను పీల్చుకొనే గాలిని గురించి ఎవరైనా అభిప్రాయాలు ఏర్పరచుకొంటారా? అలాగే నిన్ను గురించి ఇంతవరకు నేను ప్రత్యేకంగా ఆలోచించలేదు.'

అంతే. ఆ తరువాత జనరల్ హాస్పిటల్ నందనంగానూ, మెరీనా బీచ్ బృందావనంగానూ మారడాని కాట్టే కాలం పట్టలేదు. ఆనందంలో రోజులు గడిచినంత త్వరలో దుఃఖంలో రోజులు గడవవు. కష్టాల పరంపర నెత్తిమీది కొచ్చినప్పుడు రోజులెంత బరువుగా—దీర్ఘంగా గడుస్తాయని?

'మురారీ! మానవులందరూ, ఎందుకు పుడుతున్నారో...ఎందుకు గిడుతున్నారో... తెలియదు...తెలుసుకోవాలని కూడా లేదు. కానీ నేను పుట్టింది మాత్రం నీకోసమే' నంటూ ఆత్మార్పణ చేసుకొన్న వాసంతి ప్రతిఫల వాంఛారహితంగా ప్రేమించ గల్గడం ఒక్క వాసంతికే చెల్లింది. అలాంటి వాసంతికి తాను చేసిందేమిటి? తనకు జరిగిందేమిటి?

ఈ విషయం తన 'హితైషులు' అనుకునే స్నేహితులు—తానేదో పాడయిపోతు



న్నాడన్న ధీమమీద—ఇంటికి ఉత్తరం వ్రాశారు. ఫలితం —

'మదర్ సీరియస్. స్టార్ట్ ఇమ్మీడియట్లీ' అన్న టెలిగ్రాం అందుకొని ఊరికి వెళితే, బాజాభజంత్రీలతో, బంధుమిత్రులతో మంగళకరంగా వున్న ఇల్లు యెదురయింది. గుండె దడదడ లాడింది. అందులోని ఆంతర్యం పసిగట్టాడు.

వాళ్ళమ్మ దగ్గరకు వెళ్ళాడు. 'ఈ పెళ్ళి చచ్చినా నే చేసుకోను. నా యిష్టాయిష్టాలతో పనిలేక నా పెళ్ళి చేసే అధికారం మీ కెవరిచ్చారే...'

'మురారీ! మనమున్నది పవిత్రమైన భారతదేశంలో. 'మాతృదేవోభవ పితృదేవోభవ...' అన్నది మన మూలసూత్రం. దాన్ని మించిన వంశాచారాలూ, ఇంటిగౌరవాలూ... యెన్నో పిల్లలకి తెలియనివి కని, పెంచి, పెద్ద చేసే తల్లిదండ్రులకామాత్రం అధికారం లేదంటావా? ఆ అధికారం వేరే ఎవరైనా యివ్వాలంటావా? మీ నాన్న నన్నెలా చేసుకొన్నారనుకొన్నావు? మీ తాతగారి మాట వినే. వాళ్ళ నాన్న అంతే. మన ఆచారం అంతే నాయనా!'

'అది కాదమ్మా! పిల్లల బాగోగులు చూస్తూ పెంచి పెద్దచేసే తల్లిదండ్రులు పిల్లల ఆంతర్యం గ్రహించలేకపోతే ఎలాగ? చిన్నప్పుడు బజార్లో ఏ బొమ్మనుచూసి కావాలని ఏడ్చి పట్టుబడితే, మరపించడానికి తాయిలం పెట్టేదానివి. కాదు కూడదంటే వెంకన్నను పంపి తెమ్మనే దానివి. మరచిపోయావా? ఆ మనస్తత్వమే ఇప్పుడు మరి కొంచెం గట్టిపడి వుంటుందనీ, కావాలనుకొన్నదీ, మనసు కోరిందీ సంపాదించుకోవాలన్న దృఢత్వమూ ఏర్పడి ఉంటుందనీ ఎందు కనుకోవు?'

'నీవు కోరే కోరిక సవ్యమయిందైతే చెప్పు నాయనా! మేము కోరేది నీ సుఖమూ, నీ వలన వృద్ధి అయ్యే మన వంశాచారమే గదా!'

'అయితే, నేను వాసంతిని తప్ప మరొకర్ని చేపట్టలేనమ్మా! కన్నెత్తి కూడా మరొకర్ని చూసే సాహసం చెయ్యలేను. వాసంతి నా జీవిత భాగస్వామిని కానినాడు, మురారికి జీవితమే లేదు. వాసంతి కేం తక్కువయిందని, నన్ను కాదని ఈ పెళ్ళి

ఎలుకలూ-మద్యపానోన్మత్తులూ

మద్యపానం అతిగా అవటంవల్ల శరీరానికీ, మనస్సుకీ కలిగే బాధలని గురించి అందరికీ తెలుసు. వాటి కారణాలని గురించి అంతగా తెలియదు. కొంతకాలంగా పరిశోధన జరుగుతోంది. కొన్ని పరిశోధనల ఫలితాలు ...

కొందరు బాగా తాగుతారు, మరి కొందరు బాగా తాగి మద్యపానోన్మత్తులవుతారు. ఈ రెండు రకాల వారి మధ్య తేడా స్పష్టంగా కనిపించకపోయినా అది ఉండటం మాత్రం ఉందని అనాలి.

మద్యపానం కేవలం దుర్వ్యసనం అనుకునే వారిసంఖ్య అధికం. ఇది సరయిన ఊహ కాదు, మద్యపానోన్మత్తులని గురించి తగినంత పరిశోధన జరిపి వారి కష్టాలని ఎలాగ తీర్చాలో తెలుసుకొనటం అవసరం అనుకుని కృషిచేస్తూవచ్చిన వైద్యులు కొందరు తమ పరిశోధన ఫలితాలని ప్రచురిస్తూ వచ్చారు. ఈ పరిశోధనల ఖర్చులని భరించిన సంస్థలలో మద్యపానీయాలని తయారు చేసే సంస్థలు కూడా ఉన్నాయి!

మద్యపానోన్మత్తులకి తాగటం ఆపితే మూర్ఛలు, భ్రాంతులు మొదలయినవి వస్తాయి. ఇవి ఎందుకు వస్తాయి?

పరిశోధకులలో అగ్రగణ్యుడయిన డా. బ్రూస్ రిట్సన్ అనే ఆయన ఎలుకలమీద కొన్ని ప్రయోగాలు చేశాడు. కొన్ని ఎలుకలకి సారాయం అలవాటుచేసి వాటి మెదళ్ళని అనుశీలించి చూశాడు.

ఆరువారాలు సారాయం సేవించిన ఎలుకల మెదళ్ళలో 'సెరోటోనిన్' అనే పదార్థం బాగా అధికంగా ఉండటం డా. రిట్సన్ గమనించాడు. ఇటువంటి ఎలుకలకి సారాయం ఆపితే అవికూడా బాధపడేవిట.

మరికొన్ని ఎలుకల మెదళ్ళలో సెరోటోనిన్ అధికం కాకముందే సారాయం ఆపివేస్తే అవి అంత బాధ పడలేదుట.

సెరోటోనిన్ మోతాదుని బట్టి మానసిక స్థితి మారుతూ ఉంటుందన్న సంగతి కొంతకాలంగా తెలిసిందే. అయితే తాగుడికీ దీనికీ సంబంధం ఏమిటి? డా. రిట్సన్ ప్రయోగాలని పరిశీలిస్తే ఒక సమాధానం తోస్తుంది. బాగా తాగేవారి మెదడు తనలో నిలవ ఉండే సెరోటోనిన్ని సాధారణ పద్ధతిలో వదిలించుకునే సామర్థ్యాన్ని కోల్పోతుంది. కొత్త పద్ధతి నొకదానిని అవలంబిస్తుంది. ఇదేమిటంటే, అదనంగా ఉండే సెరోటోనిన్ని 'హైడ్రాక్సి ట్రిప్టోఫాల్'గా మారుస్తుంది. ఈ పదార్థం ఉన్మాదలక్షణాలు కనిపించేటట్లు చేస్తుంది...

ఈ పరిశోధనలవల్ల తెలిసిన విషయాలపై మరికొంత ప్రగాఢ పరిశోధన జరిపి మందులు కనిపెట్టటం అవసరం. మద్యపాన వ్యసనాన్ని రోగంగా అర్థంచేసుకుని చికిత్స చెయ్యాలి ...

—జాన్‌కోడ్డు (ఫీ. వ. ఫీ.)

శ్చయించారమ్మా!'

'హెచ్చు తగ్గుల ప్రసక్తే లేదిందులో నాయనా! లాంఛనం తక్కువయిందని లీలను వద్దంటున్నావు మువ్వు? కావలసింది — అంతస్థు, ఇంటితనం, ఆచారాలు, కుల గోత్రాలు. పిల్లకూడా చక్కనిదే. వాసంతి కూడా చక్కగానే వుంది. పైగా నీ అంత చదువుకొంది. వినయ గుణవంతురాలు. పైగా మన శాఖ కాదు. మన భాష కాదు. కళ్యాణానికి, వియ్యానికి సమానత్వం వుండాలంటారు పెద్దలు. నీవూ కాదనలేవుగదా ఆ మాటను.'

'అంతస్థుల మెట్లపై నిలబడి నేను నీకు అన్యాయం చెయ్యలేనమ్మా! నీవేమైనా అను.'

అంతలో నాన్నగారి రంగ ప్రవేశం. 'చూడు మురారీ! నీవు నా మాటను కాదనగలవని, అంతవాడి వయ్యావని, అవుతావని నాకు తెలియదు. అందుకనే, రంగనాథంగారు తన కూతుర్ని నీకివ్వాలని, వాసంతి నీకు తెలియక ముందునుంచీ అంటుంటే ఇప్పుడు మాటిచ్చాము. పిల్ల చక్కగా ఉంది. అంతో యింతో చదువుకొంది. మన యింటి ఆచారాలను అర్థం చేసుకోగలదు. అంతకంటే కావలసిందేముంది? నీవు మా మాటను కాదని—వో అనామకురాలిని చేసుకొంటున్నావన్న అపప్రథే మాకు కల్గించాలను

ఆహుతి

కొంటే - ఇదో ఈ కత్తితో మీ అమ్మనూ, నన్నూ పొడిచేసి నీవు వెళ్ళొచ్చు'

'వాసంతి అనామకురాలెలా అవుతుంది? ఈనాడు డాక్టరు వాసంతి! రేపు ఫలానా జడ్జి కోడలు వాసంతి! మీరు కోరిన కట్నం యివ్వలేక పోవచ్చు. అంతే!'

'ఇచ్చిన మాటను నిలబెట్టు నాయనా' అమ్మ ఏడుపు.

వాళ్ళ చేతుల్లో యజ్ఞ పశువయి పోయాడు తను. తన జీవిత కుసుమాన్ని వాళ్ళ పెద్దరికమనే కబంధ హస్తాలతో నలిపి పారవేశారు.

ఫలితం—లీల యాభై వేల రూపాయలతో భార్య అనే స్థానాన్ని కొనుక్కోగల్గింది. కానీ వాసంతి పరమైన మనసు లీలను పరిగ్రహించడానికి సిద్ధపడక పోయింది. రెండు జీవితాలు జీవించడం తనకూ చేతకాకపోయింది.

మద్రాసు రావడానికేదో భయం. బెరుకు తనం. అయినా తప్పనిసరి. తప్పలేదు. పెళ్ళయిన విషయం అందరికీ తెలిసి పోయింది. 'ఆంధ్రులను నమ్మకూడదు' అన్నారట తన కొలీగ్ శ్రీనివాసన్ వాసంతితో.

'నన్ను చూసిందే గుండెలు బ్రద్దలయ్యేలా ఏడ్చే వాసంతి నేమని వోదార్చను? తెలియక. మాటలు రాక కన్నీరు కార్చడమే



నా నంతా అయింది. అప్పటి వాసంతి కంటి కాటుక అంటిన తెల్లని టెర్లిన్ పర్చు ఇప్పటికీ ఉంది బీరువాలో పదిలంగా. అదే నాకు మిగిలిన పెన్నిధి. జీవితంలో యింకేం మిగుల్చుకోలేక పోయాను.'

తనే తెప్పరిల్లుకొని, మామూలుగా నవ్వేస్తూ, 'ఎలా ఉంది మీ ఆవిడ? అందగత్తెనా? ఎంతవరకు చదువుకొంది...' ఎప్పుడో ఏళ్ళ ఎత్తుకు పెరిగినట్లనిపించింది.

'మౌనం నా వంతయింది. 'ఎవరితోనూ మాట్లాడవద్దందా? మీ ఆవిడ.' అంది నవ్వుతో... ఆ నవ్వులో జీవం లేదు. మొహం నలభై ఏండ్ల ముసలితనాన్ని పులుముకొన్నట్లగుపించింది.

'వాసంతీ! నన్ను తిట్టు. నీ కన్నీళ్ళతో శపించు. అంతేగానీ క్షమించకు. క్షమించి చిత్రవధ చెయ్యకు.' అంటూ బావురుమన్న తనకు, 'మురారీ! మనం మానవులమన్న విషయం మరచిపోతే ఎలాగ? మానవుడు విధి చేతిలో కీలుబొమ్మ. తానొకటి తలిస్తే దేవుడొకటి తలచునన్న విషయం నీకు మాత్రం తెలియదా? మనం అనుకొనేవన్నీ జరుగుతూపోతే మనకీ దేవుడికీ తేడా వుండొద్దూ? నీకు నేనేమీ కాకపోయినా, మన మధ్య స్నేహం మాత్రం ఉంచు మురారీ! అది మాత్రం దూరం చెయ్యకు' అంటూ తన జీవితంనుండి నిష్క్రమించింది.

ఎంత చెప్పినా వినకుండా, చదువుకు న్యాయం చేకూర్చలేనంటూ పరీక్షలకు వెళ్ళకుండా, ఆ ఊరినుండి నిష్క్రమించింది. దీనికి ఎవరు బాధ్యులు? ఏం చెయ్యలేని పరిస్థితి. చేతులకు శృంఖలాలు పడ్డాయి. లోపల్లోపల కుమిలటం తప్ప మాటలాడే సమయమూ కాదు. ఎమ్. డి. పాసయి వచ్చేస్తూ వాసంతి ఊరికి ఉత్తరం వ్రాశాడు.

వాసంతీ!

జీవితం జీవించడానికే నన్న విషయం నీకు తెలిసిందే గదా? పైగా మనం ప్రతిదేది మనకోసం కాదనీ, మరొకరికోసమేననీ నీవూ చెపుతుంటావు గదా! నీ జీవితంలో జరగకూడని అన్యాయమే జరిగిపోయింది. అది నా మూలంగా జరిగింది కాబట్టి

నిన్ను క్షమించమని కూడా అడగలేను? కాని ఒక్క స్నేహితుడుగా, నీ మేలు, నీ మంచికోరే హితైషిగా ఒక్కటి చెప్పుతాను. నా మాట మన్నించగలవన్న విశ్వాసం నాకింకా ఉంది. వాసంతి! నా మాట వమ్ము చెయ్యవు గదా! జరిగింది ఓ పీడకలగా మరచిపో. బ్రతుకును ఆనందమయం చేసుకో. మీ తల్లిదండ్రుల ఆనందంకోసమైనా నీవు వివాహం చేసుకోక తప్పదు వాసంతీ! 'గాలి వీచి పూవుల తీగ నేల రాలిపోతే చేరదీసి నీరు పోసి చిగురించనీయ'మన్నాడో ఆధునిక సినీకవి? నన్ను మరచిపో. మరొకర్ని చేపట్టి, జీవితంలో ఎనలేని సౌఖ్యాన్ని, ఆనందాన్ని పొందాలని కోరుతున్న — మురారి.

దీనికి జవాబు వస్తుందని ఆశించలేదు. రావాలని మాత్రం కోరుకున్నాడంతే. చాలాకాలానికి వాసంతి రిప్లై వ్రాసింది. నెత్తిన మరో పిడుగు పడినట్లనిపించింది.

"మురారీ!

పసుపుతాడు కట్టుకొన్నంత మాత్రాన మనిషిమీద అధికారం ప్రసాదించవచ్చునేమో గాని, మనసు మీద అధికారం సంపాదించ గలమా? పెంచుకొన్న ఆశలు, మమతలు పసుపుతాడు వేయనంత మాత్రాన మడిచి పెట్టుకొని పోగలవా? మురారీ! నాకు మానవత్వం మీద, మనుష్యులకూ, మనుష్యులకూ మధ్య ఉండే మమతలమీద నమ్మకం తప్ప మన వివాహ వ్యవస్థ మీద నమ్మకం లేదు మురారీ! 'సిగరెట్లు కాల్చకండి!' అనే భార్య నెత్తిన చెయ్యి పెట్టి, 'అలా కాల్చనే, నీ ఒట్టు.' అని చెప్పి ఆవతలికెళ్లి సిగరెట్లు కాల్చే మగవాళ్లెంత మంది లేరు? ఆ భార్యకున్న విలువేమిటిప్పుడు? మురారీ! భార్య అన్న స్థానం తప్ప.

నేను మరొకరి భార్యనయి, ఆత్మవంచన చేసుకొంటూ, అనుక్షణం నన్ను నేను చంపుకొంటూ రెండు బ్రతుకులు బ్రతకలేను మురారీ! దయచేసి నన్నా కోరిక కోరకు. నా జీవితంలో వెలుగురేఖ మాయమయి పోయింది. మురారిలేని జీవితం జీవితమే కాదు. ప్రాక్టికల్‌గా వాసంతి చచ్చిపోయింది. అయినా కని పెంచి పెద్ద జేసిన తల్లిదండ్రులకు మనం కాస్త కృతజ్ఞత చూపద్దా? అందుకోసమైనా బ్రతకాలి. నా కన్యాయం చేశానని బాధ పడకు. ఎలా జరగాలనివుంటే అలా జరుగుతుంది. ఏం చెప్పను?

నీ క్షేమమే నా కోరిక!

ఇట్లు

వాసంతి.

హైద్రాబాద్ కొచ్చిందరువాత గాని, మద్రాసులో నేను పోగొట్టుకొన్న దేమిటో ...తెలియలేదు. బ్రతుకు బరువుగా, నిస్సారంగా, దుర్భరంగా కన్పిస్తోంది. అవ్యక్తమైన ఆవేదన దహించివేస్తోంది. శీల! శీలను చూడడానికే భయమేస్తోంది! భార్యగా ఊహించుకోలేక పోతున్నాడు. ఆ స్థానం ఒక్క వాసంతికే అంకితం. మరిప్పుడు శీలనేం చెయ్యాలి? ఆలోచనలు పిచ్చెక్కిస్తున్నాయి, త్రాగుడు కలవాటు పడక తప్పలేదు. శీలను ఎంత ప్రయత్నించినా చేతికి చిక్కించుకోలేక పోయాడు. శీల కళ్యాణం జరుగుతోందని కూడా తెలుసు. ఆ విషయంలో అశక్తుడు. ఏం చెయ్యలేడు.

'శీలా! నీ కన్యాయం జరుగుతోంది. నన్ను క్షమించి, నీవు వేరే ఎవరినైనా పెళ్లిచేసుకో శీలా! నా వలన నీకేం సుఖమూ ఉండదు. నాకు వివాహంపై



వాంఛ లేదు లీలా! అమ్మ నాన్నలు విన లేదు. నీ మెడకు ఉరిత్రాడు బిగించారు.'

'మీకు లేని వాంఛ నాకు మాత్రం ఉన్న దనికాదు. భార్యగా కాకపోయినా, స్నేహితురాలుగా చెప్పండి. మీరెందుకలా ఉంటారు? ఏదో పోగొట్టు కొన్నట్లు మీలో మీరే మథనపడడ మెందుకు? మీ సుఖంలో వద్దు. మీ బాధలోనైనా నా భాగం పంచుకోనివ్వరా? నన్ను.' కన్నీళ్లతో లీల ప్రాధేయ పడుతూంటే—వేటగాని బాణం గురి తప్పకుండా వచ్చి తగిలిన పక్షిలా అయ్యాడు తను.

'లీలా! నేను మద్రాసు మెడికల్ కాలేజీలో ఉండగా వాసంతి అన్నవో మెడికల్ స్టూడెంటుండేది. చాలా అమాయకురాలు మూర్తీభవించిన మంచితనం ఆమె. మే మిద్దరం ప్రేమించుకొన్నాము. లీలా! వాసంతి లేని బ్రతుకు నేనప్పట్లో ఊహించేవాడ్నే కాదు. కానీ విధి లిఖితం. ఆమె స్థానం నీ వాక్రమించావు. కానీ ఆమె పరమైన మనసుమాత్రం నీవైపుకు మళ్ళించలేక పోతున్నా, ఎంత ప్రయత్నించినా. మనసు, మమతలు లేని యాంత్రిక బంధం నా కసహ్యం లీలా! అందుకే నీవు మరొకర్ని వివాహంచేసుకో నేను చేయిస్తాను పెళ్ళి...'

'అదృష్టవంతురాలు. ఆవిడలో అంతగా మిమ్మల్ని ఆకర్షించిం దేమిటో...'

'ఆకర్షణలకు లొంగిపోయా ననుకోకు లీలా! ఆమె చాలా సామాన్యమైన యువతి. నీ కంటే దేనిలోనూ ఆమె గొప్పకాదు. నన్నంతగా బంధించి ఉంచిందేమిటో నాకూ అర్థం కాదు. అదేదో... అంటారే పూర్వజన్మాను బంధమని. అలాంటిదే కావచ్చు.' ఎటో చూస్తూ సమాధాన మిచ్చాడు.

'ఆవిడను మీ రిప్పుడు తెచ్చుకోండి. మీ సుఖానికి నే నడ్డురాను.' లీలకంటిలో నీళ్ళు విచలుణ్నిచేసి పారేయగా,

'లీలా!' అంటూ వాగావు కేక పెట్టాడు.

కొత్త కొత్త ఆలోచనలు రాసాగాయి. బ్రతుకు మరీ దుర్భర మనిపించినవుడు — పున్నమి వెన్నెల్లో, మల్లెల పరిమళాల మత్తులో, వాసంతిని లేవదీసుకొని

ఎక్కడికయినా పారిపోదా మనిపించేది. కానీ ఈ సొసైటీ, హోదా—ఇవి చాలు. జీవితాన్ని నరకం చెయ్యడానికి.

అప్పుడే వచ్చింది వాసంతి. ఢిల్లీకేదో ఇంటర్వ్యూకోసం వెడుతూ, మా సంసారాన్ని చూడ్డంకోసం ఒకరోజు ఆగింది.

ముందున్న లావణ్యం లేదు. కళ్ళల్లో ఆ చురుకు లేదు. మనిషి ఏ పదిఏండ్లు ఎదిగినట్లు కన్పించింది.

భోజనాలనంతరం మేడమీది గదిలో కూర్చొని న్యూస్‌పేపరు చదువుతున్న నా దగ్గరకు సరాసరి వచ్చి, కుర్చీని దగ్గరగా లాక్కొని కూర్చుంది.

'మురారీ! త్యాగమంటే ఏమిటి ?'

'డొంక తిరుగుళ్ళుమాని, అడగ దలచు కొన్న దేమిటో మాటిగా అడుగు.'

'లీల ఏం చేసిందని ఆవిడకీ శిక్ష ? నీవు చేసిన పనికిమాలిన పనికి, ఆవిడెలా బాధ్యురాలు? ఆనాడే, ఈ నిర్ణయం తీసుకొని ఉండవలసింది మురారీ! మీనాన్నకు చెప్పి ఉండాల్సింది. వాసంతికి తప్ప నీ హృదయంలో మరెవ్వరికి స్థానం లేదనీ, ఇవ్వలేవనీ. 'లేదా సరాసరి మద్రాసు వచ్చేసి ఉండాల్సింది. అప్పుడేమొ వాళ్ళతోబాటు నీకూ, హోదా, అంతస్తూ, డబ్బూ, ఇల్లూ కావలసి వచ్చేయి' ఇప్పుడేమొ, నీ అశక్తతను, చేతగానితనాన్ని ఆ అమాయకురాలిపై చూపిస్తున్నావు. నీ జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా, తన జీవితాన్నీ నాశనం చేస్తున్నావు. ఈ హింసాకాండకు అంతమెక్కడ మురారీ?'

ఆహుతి

'వాసంతీ! మనుష్యులందరూ కాకపోయినా, కొంతమందయినా ఒక్కలాగే ఉంటారనీ, నేనూ నీలాంటి మనిషినే అనీ, నాకున్నది హృదయమేననీ ఎందుకనుకోవు? నీవెందుకలా ఉండిపోయావు? ఆ పాపం మాత్రం నాది కాదా? నీ ఉసురు మాత్రం తగలదేమిటి? నీ పెళ్ళి చూడాలని కలవరించి, కలలు కని ఏడ్చి దూరమయిపోయిన మీ తల్లిదండ్రుల ఉసురు మాత్రం తగలదేమిటి? నీవు మాత్రం ఎందుకు పెళ్ళి చేసుకోలేదు. నాకిచ్చిన మనసు మరొకరి కివ్వలేక. అంతేనా? నాకూ అలాగే ఉండదా? పరిస్థితుల ప్రాబల్యం ఆమె మెడలో తాళికట్టేలా చేసింది ఆ పాపం నన్ను చుట్టుముట్టినా ముట్టనీ! క! నేను అశక్తుణ్ణి. బలవంతంగానైనా ఆమె జీవితంలోకి ప్రవేశించలేను...'

'అది ముందే ఆలోచించుకొని ఉండవలసింది మురారీ.'

'నేను కాదు. వాళ్ళ తల్లిదండ్రులాలోచించుకొని ఉండాలి. ఇప్పుడు నీక్కావలసింది నా సుఖమా? లీల సుఖమా?'

'ఇద్దరిదీను. నాలోని మానవత్వం లీల సుఖం కోరుతూంటే, మమత నీ బాగు కోరుతోంది మురారీ!'

'అదే నిజమయితే, నాతోపాటు వచ్చేయి. మనం ఎక్కడైనా వెళ్ళి హాయిగా ఉందాము...'

'మురారీ!' పిలుపు కాదది. గర్జన. 'ఎంత నైచ్యానికి పాల్పడుతున్నావు. స్వార్థంతో నీ కళ్ళు మూసుకుపోతున్నాయి. ఇప్పుడేం మాట్లాడి నీతో లాభంలేదు. ఛీ...ఛీ...'

'ఏం? ఈ అగ్గిరీలుండవని భయమా? కారుండదు. సొసైటీలో గొప్ప పేరుండదు...'

'నే బ్రతికి ఉంటేనేగదూ! నీ బుద్ధి ఇలా పెడదారులుపడుతోంది. ఇంక నీ వాసంతి నీకే కాదు' ప్రపంచానికే శాశ్వతంగా దూరమయి పోతుంది.' కన్నీళ్ళతో గబ గబ మెట్లుదిగి అదృశ్యమై పోయిన వాసంతి!

మళ్ళీ ఇన్నాళ్ళకు దర్శనమివ్వబోతోంది!

తన జీవితంనుండి లీల నిష్క్రమించింది. బలవంతంగా తన జీవితంలోకి ఎలా ప్రవేశపెట్టారో...వాళ్ళ తల్లిదండ్రులు అంత బలవంతంగానూ లాక్కుపోయారు. యాభై వేలకు మరో ఇరవై వేలు వేసి ఇచ్చేశాను. 'పాప పరిష్కారం చేసుకోవా లనుకొంటున్నావా దీంతో ?' మామగారి అవహేళన. 'కాదు. తోబుట్టువు కిచ్చే లాంఛనం లాంటిది.'

తమ పెద్దరికం కొడుకు బ్రతుకు నిలా నాశనం చేస్తుందని ఎదురు చూడని అమ్మ నాన్నలు, వాళ్ళ ఆశలు దెబ్బతిని పోగా, వరుసగా మూడు జీవితాలు నాశనం చేశామన్న దిగులుతోనే 'మురారీ! ఆ వాసంతినే చేసుకో నాయనా! మా కళ్ళ ముందు, నీవిలా వుండేకన్నా మమ్మల్ని ఒక్కసారిగా చంపెయ్యరా...' అంటూనే



కన్ను మూశారు.

* * *

ఒంటరితనం ... భరించరాని ఒంటరితనం. ఒంటరితనాన్ని అనుభవించడంకన్న పెద్ద శిక్ష లేదు మానవుడికి అనిపిస్తుంది. లీల ఉన్నా హాయిగా ఉండేది—ఇంట్లో ఆడదిక్కుండేది. వాసంతి రాక ముందే ఈ సోడా బాటిల్స్, ఇవి తీసి దాచెయ్యాలి. లేకుంటే మరల సంజాయిషీ, ఏడుపు. బ్రతిమిలాడడాలు...విసుగొస్తోంది.

కాలింగ్ బెల్ చప్పుడయితే ఏ పేషెంటో ననుకొని వాకిలి తీసిన మురారికి వాసంతే ఎదురయింది. ఆశ్చర్యం కాదు. భయం, కంగారు ముంచెత్తింది.

'మురారీ! ఇంత పతనమయి పోయావెందుకని? పదిమందికీ ప్రాణదానం చెయ్యాల్సిన నీవు—ఒక్క ఆడదాని కోసం ఇలా నాశనమయి పోయావంటే...' ఏడుపు మాటల నాపేసింది.

'ఏడ్చి ప్రయోజనం లేదు వాసంతీ! గతజల సేతుబంధనంతో ప్రయోజనం లేదు పుడుతున్నాము. గిడుతున్నాము — మధ్యలో ఎన్నో మజిలీలు! వచ్చిన పని అయిపోయింది. పోవడం కోసం యెదురు చూద్దాము...'

'ఈ వేదాంతం ఎప్పటినుండి మొదలయింది మురారీ? పాన పాత్ర చేతికొచ్చేకేనా? ఇంక నిన్ను వదలను సర్వనాశనం కాకముందే నాతో వచ్చేయి. పోదాము.' చెయ్యి పట్టుకొంది. నాలో ఏముందని లాక్కెళుతున్నావు వాసంతీ? ఈ నిర్ణయం పది, పదిహేనేళ్ల క్రిందట తీసుకొని ఉంటే బాగుండేది! ఇద్దరి జీవితాలయినా బాగుపడి ఉండేవి. ఇహ నన్ను వదిలెయ్. వాసంతీ!'

'మురారీ! నన్ను చిత్రవధ చెయ్యకు. నీముందే తలకొట్టుకొని చస్తాను.'

'వస్తాను వాసంతీ! నీ కోరిక కాదనటం ఎందుకు? చాలాకాలం తరువాత వాసంతి మొహం ఆనందంతో కళకళలాడింది. చిన్నపిల్లలా ఎన్నో కబుర్లు చెప్పింది. చాలా రాత్రయిం తరువాత 'పడుకో మురారీ ప్రొద్దుట లేద్దాము' అంటూ శయనరూముకు వెళ్లింది.

ఉదయం పనికుర్రాడొచ్చి దబ దబ తలుపు బాదుతూంటే మెలకువ వచ్చింది.

'అమ్మగారూ! డాక్టరుగారు ఎంత లేపినా లేవడం లేదమ్మా! టేబిల్‌మీద ఈ ఉత్తరం ఉంది.'

అదిరిపడి ఆ ఉత్తరం అందుకొంది:

'వాసంతీ! అందరూ కలిసి నా బ్రతుకుతో చదరంగం ఆడుకొన్నారు. ముఖ్య పాత్ర నీది. కానీ నీకు తెలియకపోవచ్చు. నీ జీవితాన్ని నేను నాశనం చేశాను. కాదనడం లేదు. నీ దగ్గరకేముఖం పెట్టుకొని రాను? నా బలహీనతకు నీవు బాధ్యురాలెలా అవుతావు? ఈ బరువును నీపై రుద్దడం నా కిష్టం లేదు. అదీగాక నేను కొరనరీ పేషెంటును. ఆట్టే నాళ్లు బ్రతకను. ఎవరికోసం బ్రతకాలి? మోడువారిన మన జీవితాలు ఇక చిగురించవు. ఇంకో జన్మలో నయినా ఈ అన్యాయం జరగకూడదని దేవుని ప్రార్థిస్తున్నా. నీవు నన్ను వదలవు. అందుకని నేనే నిన్ను వదిలేస్తున్నా, బాధపడకు.

నీ మురారి.'

'మురారీ!' అన్న కేకతో వాసంతి మంచంమీదకు వాలిపోయింది. ●

నాణ్యతగల వస్త్రాలు?

హార్వే ట్విన్ టస్కర్

డ్రిల్‌లు • పాప్లిన్‌లు • గాబర్డీన్‌లు మొదలైనవి

హార్వే ట్విన్ టస్కర్

మధుర మిల్స్ కంపెనీ లిమిటెడ్, మధురై.